తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు

- ఎమ్మెల్యే నిమ్మలవి డ్రామాలు
- జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటే ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రైతులను తప్పుదారి పట్టిస్తూ డ్రామాలు ఆడుతున్నారని జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవురు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల ఉరివేసుకుంటూ డ్రామా కట్టడం అతని పబ్లిసిటీ పిచ్చి పరాకాష్టకు చేరిందని హేళన చేశారు. సమస్యను పక్కదారి పటిస్తూ టీవీల్లోనూ, పత్రికల్లోనూ ప్రముఖంగా కనిపించాలనే తాపత్రయంతో చేసే డ్రామా ట్రిక్కులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రైతులకు మిల్లర్లతో సమస్యలు తలెత్తకుండా, సంచుల కొరత లేకుండా, ఎగుమతి, దిగుమతి సమస్యలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేస్తుంటే ఎమ్మెల్యే రైతులను మోసం చేస్తూ ధర్నాలు చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. రైతులకు సమస్యలు తలెత్తినప్పుడు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని, కానీ ఎమ్మెల్యే హుందాగా ప్రవర్తించడం లేదని ఆరోపించారు. దళారీ వ్యవస్థకు పూర్తిగా అడ్డుకట్ట వేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా మిల్లర్లకు అమ్ముకునే సౌకర్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. ఈ చర్యలు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు రుచించడం లేదని వివరించారు. ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 రకాలను నాటవద్దని వ్యవసాయాధికారులు రైతులకు ముందే చెప్పినా వినకపోవడంతో ఈ సమస్య తలెత్తిందన్నారు. నూక శాతం నిబంధనలను కేంద్రప్రభుత్వం సడలించాల్సి ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు సీఎం జగన్ ఎంతో మేలు చేస్తున్నారన్నారు. శివదేవునిచిక్కాల, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులు వర్ధనపు విజయ్‌కుమార్, పి.నరసింహరాజు మాట్లాడుతూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాల వల్లరైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అలాగే డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో సకాలంలో పడుతున్నాయని వివరించారు. ఎమ్మెల్యే నిమ్మల కేవలం పబ్లిసిటీ కోసం ధర్నాలు చేయడం విచారకరమన్నారు. విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైకేల్‌రాజు, సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, మండల కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, ఏనుగుపల్లి చంద్రశేఖర్, మడికి విక్రమ్, పాలపర్తి నాగేశ్వరరావు, పాత్తూరి రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రంగనాథరాజును కలిసిన డీపీఓ


మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసిన డీపీఓ మల్లికార్జునరావు

పెనుగొండ: డీపీఓగా బాధ్యతలు స్వీకరించిన జి.మల్లికార్జునరావు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం తూర్పుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి పంచాయతీల అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై చర్చించారు. ఆయన వెంట పెనుగొండ కార్యదర్శి నరసింహమూర్తి ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మొగల్తూరు: గత రాత్రి మొగల్తూరులోని జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన యువకుడు భీమవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.వీరబాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం భీమవరంలోని కొవ్వాడ పుంత ప్రాంతానికి చెందిన బొండాడ చరణ్ రవితేజ, అతని బంధువు నూకల అనూష ఓ స్కూటర్‌పై మొగల్తూరు వైపు వస్తున్నారు. సోమవారం రాత్రి మొగల్తూరులోని పెట్రోల్ బంక్ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ నరసాపురం ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికత్స పొందుతూ బొండాడ చరణ్ రవితేజ (16) మంగళవారం వేకువజామున మృతి చెందాడు. మృతుని తండ్రి మాధవ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్ఈబీ దాడిలో మహిళ అరెస్టు

సాక్షి, భీమవరం: గునుపూడిలో అక్రమంగా మద్యం, బీరు బాటిళ్లు కలిగిన ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీవీవీఎస్ఎన్ శర్మ మంగళవారం చెప్పారు. తమకు అందిన సమాచారం మేరకు గునుపూడి అంబేడ్కర్ నగర్‌లో సిబ్బందితో కలిసి దాడి చేసి తాటిపాక శాంతమ్మను అరెస్టు చేసి, ఆమె వద్ద అక్రమంగా ఉన్న 13 బీరు, 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు జి.సునీల్‌కుమార్, బి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

11న సబ్ జూనియర్ వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

సాక్షి, భీమవరం: సబ్ జూనియర్ వాలీబాల్ రాష్ట్ర జట్టు ఎంపికలో భాగంగా ఈ నెల 11వ తేదీన భీమవరంలోని డీఎన్నార్ కళాశాల ఆవరణలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి జీవీ పవన్‌కుమార్‌రాజు చెప్పారు. మంగళవారం ఆయన భీమవరంలో విలేకరులతో మాట్లాడుతూ 11వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం సెల్ 97041 02444, 63035 78996, 98669 38122 నంబర్స్‌కు సంప్రదించాలని పవన్‌కుమార్‌రాజు కోరారు.

నేటినుంచి క్రైస్తవ ఉజ్జీవ సభలు

ఉండి: మండలంలో సెయింట్‌పాల్స్ లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు క్రైస్తవ ఉజ్జీవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చర్చ్ కార్యదర్శి, సభల కన్వీనర్ చిట్టూరి జోషి తెలిపారు.చర్చ్ ఆవరణలో ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి నిర్వహించే ఈ సభలను స్థానిక పేరిష్ పాస్టర్ రెవరెండ్ మానుకొండ ప్రసన్న ప్రారంభిస్తారని అన్నారు.సభలకు బ్రదర్ పీ జేమ్స్(వేట్లపాలెం),రెవరెండ్ సీహెచ్ సంతోష్‌రెడ్డి(రాజమండ్రి) ప్రత్యేక ప్రసంగికులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజు చర్చ్ యూత్ ప్రత్యేక గీతాలను ఆలపించి దేవుని మహిమపరుస్తారని తెలిపారు. ఉండి పరిసర ప్రాంతాల నుంచి విశ్వాసులు పెద్ద ఎత్తున హాజరు కావాలని జోషి తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

సాక్షి, భీమవరం : భీమవరం వన్‌టౌన్ పరిధిలోని జాతీయ రహదారిపక్కన ఒక యువతి తో వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేశామని సీఐ ఎ.శ్రీను తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1500, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైభవంగా పల్లాలమ్మ జాతర

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలో పల్లాలమ్మ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా ఆదివారం జరిగింది. అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. ఊరేగింపులో పలు వేషధారణలు, డప్పులు, గరగ నృత్యాలు, సన్నాయి మేళాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే జాతర సందర్భంగా అమ్మవార్లకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

పాలకొల్లు అర్బన్: గర్భిణులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనిస్తారని పాలకొల్లు ఛాంబర్స్ కళాశాల ప్రిన్సిపాల్ తోట వోల్గా అన్నారు. వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం 35 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా పౌష్టికాహారం అందజేశారు. నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కాళ్ల: మండలంలో ఎన్ఆర్‌జీఎస్ పథకంలో ఇప్పటి వరకు జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహణపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు మంగళవారం ఎంపీడీవో స్వాతి తెలిపారు. మండలంలో 21 గ్రామాల్లో జరిగిన పనులపై ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. 17వ తేదీన ఇప్పటి వరకు జరిగిన పనులపై మండల కేంద్రమైన కాళ్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షించిన నాయకులు


మొగల్తూరులో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, అధికారులు


పూలపల్లి సచివాలయంలో సీఎం జగన్ ప్రసంగాన్ని తిలకిస్తున్న అధికారులు


మేడపాడు రైతు భరోసా కేంద్రంలో టీవీలో ముఖ్యమంత్రి జగన్ ప్రసంగాన్ని వింటున్న ప్రజలు

మొగల్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు వీక్షించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న విధానంలో సమస్యలున్నా, వ్యవసాయ రంగంలో సమస్యలు, ఆరోగ్య శ్రీ సేవలు విషయంలో సమస్యలున్నా, ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సమస్యపైనైనా సమస్యలుంటే జగనన్నకు చెబుదాంలో ఇచ్చిన నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్‌సీ ఆనంద్ కుమార్, వ్యవసాయాధికారిణి ఎం.సుజాత, నాయకులు రేవు రాంబాబు, పాలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూలపల్లిలో..

పాలకొల్లు అర్బన్: అర్హత ఉన్నా నవరత్నాల పథకాలను పొందలేని పేదలకు మేలు చేయడమే జగనన్నకు చెబుదాం లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి కె అప్పారావు అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి అప్పారావు మాట్లాడుతూ ప్రతీ సమస్యకు ఐడీ నెంబర్ ఇవ్వస్తారన్నారు. సీఎం జగన్ స్వయంగా వీటిపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. మండల, జిల్లా స్థాయిలో గుర్తించిన సమస్యలన్నీ పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం, పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ, వీఆర్వో సుజాత, అగ్రికల్చర్ అసిస్టెంట్ భ్రమరాంబిక, రాజశేఖర్, విజయశంకర్ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: జగనన్నకు చెబుదాం లాంచింగ్‌ను మండలంలోని అన్ని సచివాలయాల్లో టీవీలు ఏర్పాటు చేసి ప్రజలకు చూపించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రసంగాన్ని అంతా విన్నారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాల అమలులో ఇబ్బందులు ఎదురైనా ప్రతి ఒక్కరూ 1902 నెంబర్‌కు ఫోన్ చేసి పరిష్కారం పొందాలని ముఖ్యమంత్రి కోరారు.

దోమలు పెరగకుండా చర్యలు


వార్డులో డ్రెయినేజీలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

నరసాపురం: వార్డుల్లో దోమలు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావులు శానిటేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చైర్‌పర్సన్, కమిషనర్ ఇద్దరూ పట్టణంలోని 1వవార్డు శ్రీహరిపేటలో పర్యటించారు. వార్డులో డ్రెయినేజీల పరిస్థితి, వీధిదీపాలు, మంచినీటి సరఫరా అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో శానిటేషన్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డ్రెయిన్స్‌ను ప్రతీరోజూ శుభ్రం చేయాలని సూచించారు ఎంఎల్ ఆయిల్ చల్లాలని చెప్పారు. చెత్త సేకరణ సవ్యంగా చేయాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం చూపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సోమరాజు దుర్గాభవానీ, బర్రి జయరాజు, సోమరాజు భరత్ తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి హనుమాన్ చాలీసా పోటీలు


జిన్నూరులో రథయాత్ర వివరాలు ప్రకటిస్తున్న కమిటీ సభ్యులు

పోడూరు: మండలంలోని జిన్నూరు లో ఈ నెల 13,14 తేదీల్లో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పోటీలు, భద్రాచలం శ్రీసీతారాముల ఉత్సవ విగ్రహాల రథయాత్ర, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జున్నూరు గ్రామ ప్రముఖులు, సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు తెలిపారు. మంగళవారం అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగాణంలో విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో 22 దేవస్థానాల కమిటీలు ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పోటీలు, రథయాత్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వాకా శ్రీనివాసరావు, ఆచంట వెంకట సుబ్బారావు, అల్లూరి వెంకట సుబ్బరాజు, పీఎస్ ప్రతాపరాజు, భూపతి రాజు చిన్న సూరి, జి సూర్యనారయాణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ముదునూరిని కలిసిన సీఎంఎం భాస్కర్


ముదునూరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న భాస్కర్

నరసాపురం: డ్వాక్రా గ్రూపులను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో మెప్మా విభాగంలో పట్టణ సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్)గా పి.భాస్కర్‌ను కొత్తగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ మంగళవారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడం ద్వారా మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలని, వారిలో ఆర్థిక భరోసా పెంచాలని వివిధ పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. అప్పగించిన పనిని బాధ్యతగా చేయాలని భాస్కర్‌కు సూచించారు. పట్టణంలో డ్వాక్రా సంఘాల సంఖ్యను పెంచాలని, ప్రతీ మహిళ డ్వాక్రా గ్రూపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

13న జాతీయ లోక్ అదాలత్


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వరలక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: వాదించుకుంటే ఒక్కరే గెలుస్తారని చర్చించుకుంటే ఇద్దరు గెలిచినట్లవుతుందనే ఉద్దేశంతో దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసిందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వరలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి వరలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. చర్చల ద్వారా పరిష్కరించే కేసులను కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. తద్వారా సమయంతోపాటు డబ్బు కూడా ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ డి.రాంబాబు, ఎస్సైలు బి.శ్రీనివాసు, ఎస్.ముత్యాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు


భట్లమగుటూరులో ధాన్యాన్ని ఎగుమతి చేస్తున్న కూలీలు

పెనుమంట్ర: మండలంలో రెండు రోజులుగా వాతావరణం అనుకూలంగా ఉండటంతో ధాన్యం మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే రైతుల భరోసా కేంద్రాల కొనుగోళ్ల ద్వారా వేగవంతంగా జరుగుతున్నాయి. రైతులధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తూ రైస్‌మిల్లులకు రవాణా చేస్తున్నామని మండల వ్యవసాయ శాఖాధికారిణి ఎ.జోత్స్న మంగళవారం తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 1766 మంది రైతుల నుంచి 11,658.22 మెట్రిక్ టన్నులధాన్యాన్ని సేకరించి రైసు మిల్లులకు రవాణా చేవామని తెలిపారు. ఇది ఇలా ఉండగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు తన సొంత ఖర్చులతో గోనె సంచులు కొనుగోలు చేసి నియోజకవర్గంలోని రైతులందరికీ ఉచితంగా సరఫరా చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ, ఎంపీడీఓ పూర్ణబాబ్జి పర్యవేక్షణలో రైతులు మాసూళ్లను వేగవంతం చేశారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంతో రైతులకు మేలు


మండలంలోని అజ్జమూరు గరువు వద్ద రైస్‌మిల్లుకు చేరిన ధాన్యం

ఆకివీడు: ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు విధానంలో తీసుకు వచ్చిన నూతన మార్పులు రైతులకు ఎంతో మేలు చేస్తున్నాయి. మండుటెండల్లో కూడా నిమిషానికో విధంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చేతికి అందివచ్చిన ధాన్యం పంటను రైతులు ఒబ్బిడి చేసుకునే తరుణంలో ప్రకృతి వికృతిగా మారుతోంది. అన్నదాతను ప్రకృతి విపత్తుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో నూతన విధానంలో కొద్ది మార్పులు తీసుకువచ్చింది. ఇప్పటి దాకా ఆన్‌లైన్ విధానం ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యం ద్వారా కొద్దిపాటి ఆలస్యం చోటు చేసుకుంటుంది. దీంతో రైతులు వర్షాలకు దొరికిపోతుండటంతో ధాన్యం పాడైపోయే ప్రమాదం ఏర్పడిందని భావించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆన్‌లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్ విధానాన్ని అమలుజేస్తున్నారు. ఈ విధానం ద్వారా రైతు నేరుగా రైస్‌మిల్లుకు ధాన్యం విక్రయించుకునే అవకాశం ఏర్పడింది. సంబంధిత రైతుతో పాటు, మండల టీంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, వ్యవసాయాధికారి, గ్రామ రెవిన్యూ అధికారి, కస్టోడియన్ అధికారి, ఆర్బీకే ఇన్‌ఛార్జి, టెక్నికల్ అసిస్టెంట్ ధృవీకరించాల్సి ఉంది. ధృవీకరణపత్రంతో రైతు భరోసా కేంద్రంలో ఆన్‌లైన్ చేయించుకోవలసి ఉంది. ఈ విధానంతో రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకోవలసిన అవసరం లేకుండా మద్దతు ధరకే మిల్లులకు విక్రయిస్తున్నారు. ఆఫ్‌లైన్ విధానంలో విక్రయించిన ధాన్యంకు కూడా ప్రభుత్వమే 21 రోజుల్లో సొమ్ము చెల్లిస్తోంది. రబీ సీజన్‌లో అత్యధిక దిగుబడులు సాధించిన రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాలు తమకు ఎంతో మేలు చేస్తున్నాయని రైతులు బాహాటంగా చెబుతున్నారు. ప్రకృతి వికృతి చేష్టల్ని కూడా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎదుర్కొని రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జేవీకే–4 స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన ఏపీసీ


స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏపీసీ శ్యాం సుందర్

వీరవాసరం : స్థానిక ఎంఆర్‌కే ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జేవీకే- 4 స్టాక్ పాయింట్‌ను ఏపీసీ శ్యాంసుందర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులందరికీ పాఠశాల ప్రారంభం రోజునే జేవీకే కిట్లు అందిస్తారన్నారు. దీనిలో భాగంగా ప్రతి మండలానికి ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయడం జరిగిందని స్టాక్ పాయింట్లలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూస్, సాక్సులు, బ్యాగులు, యూనిఫాం వంటి వస్తువులను భద్రపరిచేందుకు ఏడు గదులను సిద్ధంగా ఉంచామన్నారు. వాటిలో ఈ వస్తువులను ముందుగా భద్రపరిచి పాఠశాలల వారీగా లెక్కించి అందజేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు మండలానికి పాఠ్యపుస్తకాలు, షూస్ యూనిఫారమ్స్, సాక్సులు, వచ్చాయని ఎంఈవో దీవి నాయకుడు తెలిపారు. డీవైఈఓ శ్రీరామ్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.ప్రభామంజరి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు చీఫ్ విప్ ముదునూరి షెడ్యూల్ ఇలా

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. సర్వసభ్య సమావేశం అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోని 22వ వార్డు కొత్తకాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నాయి.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి


గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆశక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో మంగళవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వచ్చే నెల 11 వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, భట్టిప్రోలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయునికి ప్రత్యేకాలంకరణ


ప్రత్యేకాలంకరణలో ఆంజనేస్వామి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న శ్రీ దాసోహంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ నెల 14న హనుమద్ జయంతి పురస్కరించుకుని ఆలయంలో సామూహిక సహస్రనామార్చన పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం భక్తుల రద్దీని బట్టి ఉదయం 7.30, 9.30 గంటలకు రెండు బ్యాచ్‌లుగా అలాగే రాత్రి 7 గంటలకు మూడో బ్యాచ్‌గా సహస్రనామ పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పూజలో పాల్గొనే భక్తులు 12వ తేదీ లోపు రూ. 350లు రుసుము చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పూజా కార్యక్రమం అనంతరం పూజల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి చిత్రపటం, పూర్ణఫలం, జెండా, డాలరు, బైక్ రిబ్బన్, ప్రసాద వితరణ చేయనున్నట్లు అర్చకులు శ్రీనివాస్ తెలిపారు.

వెకేషన్ బైబిల్ స్కూల్ శిక్షణా తరగతులు ప్రారంభం

సాక్షి, భీమవరం : బాలలు చిన్నతనం నుంచి మంచి మార్గంలో నడవాలని దీనికి వెకేషన్ బైబిల్ స్కూల్(వీబీఎస్) శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పట్టా దేవరాజ్ అన్నారు. భీమవరం పట్టణంలోని బేతని లూథరన్ చర్చ్‌లో మంగళవారం వీబీఎస్ శిక్షణా తరగతులు ప్రారంభించారు. చర్చ్ పాస్టర్ యు పుష్పరాజ్ మాట్లాడుతూ బాలలు చిన్నతనం నుంచి ఆపదలో ఉన్నవారికి సహాయపడే గుణం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బి శ్యామల, నిర్మల, పి.సుదర్శన్ కుమార్, పి.రతన్, టి.వజ్రమ్మ, బి.సరళ, జి.సోనా, కె.సురేఖ, పి.ఇందిరా, పి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

సాక్షి, భీమవరం : ఈనెల 6వ తేదీ నుంచి ఒక మహిళ కనిపించడం లేదని, ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బంగారం షాపులో పనిచేస్తున్న వ్యక్తిపై అనుమానం ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఏఎస్సై పి.రామకృష్ణ తెలిపారు.